క్లుప్తంగా

ఘనంగా పాలపోలమ్మ తల్లి పండగ



లైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ గ్రామ దేవత పాలపోలమ్మ తల్లి ఘటాల పండగ మంగళవారం 13వ వార్డు ప్రజలు సందడిగా నిర్వహించారు. కిల్లివారి క్వార్టర్స్, తవిటినాయుడు క్వార్టర్స్, విద్యానగర్, కొత్తకోటవారివీధి, కాలేజీ వీధి, కోర్టు ఎదురు వీధి ప్రాంతాలకు చెందిన వారంతా ఈ పండగ చేపట్టారు. మేళ తాళాలతో ముర్రాటలు తీసుకువెళ్లి తల్లికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ పూజల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీతాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బారులు తీరిన భక్తులు



క్యూలో ఉన్న భక్తులు

నరసన్నపేట: స్థానిక బజారు వీధిలోని శాంతామణి అమ్మవారు మంగళవారం భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. వేకువజాము నుంచే మహిళలు ముర్రాటలతో వచ్చి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా సమీప వీధులకు చెందిన ప్రజలు వారాలు నిర్వహించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు



శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న సర్వేయర్

మెళియాపుట్టి: మండలంలోని మర్రిపాడుకె గ్రామ పంచాయతీ జర్రిభద్ర గ్రామంలో దళితులకు సంబంధించి శ్మశాన వాటిక స్థలానికి దారిలేదని, అదేవిధంగా పక్కనే ఉన్న చెరువు గట్టు మట్టి పడి స్థలం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఇటీవల తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అందలో భాగంగానే మంగళవారం మండల సర్వేయర్ చలపతిరావు ఆ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న శ్మశానవాటిక స్థలాన్ని ఉపాధి హామీ పథకం ద్వారా ఎత్తుచేస్తే సమస్య పరిష్కారం అవుతుందని గ్రామస్తులకు తెలిపారు. కేఎస్‌పీఎస్ సభ్యుడు దేవతీపతి, గ్రామస్తులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ దేవత ఉత్సవాలు



కొత్తూరులో ముర్రాటలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, మెట్టూరు బిట్–1తోపాటు పలు గ్రామాల్లో మంగళవారం గ్రామ దేవత ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముర్రాటలతో మహిళలు ఊరేగింపుగా అమ్మవారి ఆలయాల వద్దకు చేరుకుని చల్లదనం చేశారు. గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) స్టేషన్ వద్ద ద్విచక్ర వాహనాలను ఈ నెల 12 వేలం వేయనున్నారు. ఈ మేరకు ఎస్‌ఈబీ సీఐ వై.లక్ష్మనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఉదయం పది గంటలకు వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఉదయం 9 గంటలకు ఆధార్ జిరాక్స్‌తోపాటు రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

అమ్మవారి సారె ఊరేగింపు



పాతపట్నంలో అమ్మవారి సారె ఊరేగింపు

పాతపట్నం: పాతపట్నం అమ్మవారికి మండల కేంద్రానికి చెందిన కూర్మాపు వెంకటరమణ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా సారెను అందజేశారు. మంగళవారం పాతపట్నంలో సారె ఊరేగింపు నిర్వహించారు. శివంకర్ కాలనీ ఐదో లైన్ నుంచి ప్రధాన రహదారి మీదుగా మార్కెట్, జుబ్లీ రోడ్డు మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారెను సమర్పించారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రజా సేవకులపై నిందలా?

ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై అన్నివర్గాల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్ల ద్వారా ప్రజల వద్దకే నేరుగా సంక్షేమ పథకాలు, సేవలు అందుతుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలోని టీడీపీ ప్రభుత్వానికి భిన్నంగా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను వలంటీర్లు సకాలంలో అందజేస్తున్నారు. కోవిడ్ విపత్తు సమయంలో వలంటీర్ వ్యవస్థ ఓ రక్షణ కవచంలా ప్రజల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకుంటున్నారు. వలంటీర్లపై పవన్ చేసిన అణుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

కష్టాలు తీరాయి



పింఛన్ కోసం గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ కార్యాలయం వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. పక్షవాతం కారణంగా మరింత ఇబ్బందిగా ఉండేది. ఇంటి నుంచి ఒకరు నన్ను బైక్‌పై తీసుకువెళ్లే తప్ప పంఛన్ వచ్చేదికాదు. ఈ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత వేకవజామున ఇంటికి వచ్చి నన్ను నిద్ర నుంచి లేపి ప్రతీ నెలా పింఛన్ ఒకటో తేదీన ఇస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత నా కష్టాలు తీరాయి.

– అల్లు వెంకటమ్మ, కొత్తూరు గ్రామం, కొత్తూరు మండలం

వలంటీర్లు ఆపద్బాంధవులు



నాకు ఇప్పటికీ గుర్తు.. కరోనా సెకెండ్ వేవ్‌లో మా ఇంటిల్లపాదీ హోం క్వారంటీన్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఇరుగు, పొరుగు వాళ్లతో పాటు బంధువులు కూడా ఇంటికి వచ్చేవారు కాదు. అలాంటి సమయంలో మేమున్నామంటూ ఇంటికి వచ్చి మా బాధలు, అవసరాలు తెలుసుకుని మమ్మల్ని కరోనా కష్టం నుంచి ఆదుకున్నారు.. మా ప్రాంత వలంటీర్. అమ్మాయి అయినా బాగా సహకారం అందించింది. వారి సేవలకు ఇదొక్కటి చాలు. వారి సేవలు గురించి ఎంత చెప్పినా తక్కువే. అటువంటి వారిపై పవన్‌కల్యాణ్ ఆరోపణలు చేయడం, వారిని కించపరిచే విధంగా మాట్లాడటం శోచనీయం.

– పంది కృష్ణారావు, బడ్డవానిపేట గ్రామం, నరసన్నపేట మండలం

ప్రాణాలకు తెగించి పనిచేశారు



గ్రామ వలంటీర్లు కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి పనిచేశారు. ఆ సమయంలో వారు చేసిన సేవలు ఆమోఘం. తెల్లవారకముందే పింఛన్, రేషన్ బియ్యం ఇంటివద్దకే అందించారు. 50 కుటుంబాల సంక్షేమం కోసం నిరంతరం పరితపించే వలంటీర్లను పవన్ విమర్శించడం తగదు.

– ఎద్ల ఈశ్వరరావు, లబ్ధిదారుడు, సవళాపురం జంక్షన్, సరుబుజ్జిలి

నిస్వార్థంగా సేవలు



తెల్లవారుజామునే ఇంటికి వచ్చి గ్రామ వలంటీర్ ఫించన్ అందజేస్తుంది. రూపాయి లంచం లేకుండా ప్రతీ సంక్షేమ పథకం గడప వద్దకే తీసుకువస్తున్నారు. రేషన్ సరుకులు ఇంటి ముంగిటకే తీసుకురావడం వల్ల ఎన్నో కష్టాలు తగ్గాయి. కరోనా వంటి విపత్తు సమయంలో కూడా సేవలు అందించి అందరి మన్ననలు పొందిన వలంటీర్ వ్యవస్థ ఎంతో గొప్పది. నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై పవన్ ఆరోపణలు చేయడం దుర్మార్గం.

– తిర్లంగి రాములమ్మ, తమ్మయ్యపేట గ్రామం, కలివరం పంచాయతీ, ఆమదాలవలస మండలం

మా తల్లిదండ్రులను కాపాడిన వలంటీర్



కరోనా సమయంలో మా కుటుంబాన్ని వలంటీర్ వ్యవస్థ కాపాడింది, కరోనా సమయంలో పాతపట్నం మేజర్ పంచాయతీ ప్రశాంత్‌నగర్ రెడ్ జోన్‌లో ఉండేది. బయటకు రావాలంటే బయం వేసిది. ఆ సమయంలో మా తల్లిదండ్రులు బోయిన కేశవరావు, కళ్యాణికి జ్వరం వచ్చింది. మాకు భయమేసింది. వెంటనే మా వలంటీర్ శ్రావణికి ఫోన్‌లో విషయం చెప్పాను. వెంటనే మా ఇంటికి అంబులెన్స్ తీసుకువచ్చి, పాతపట్నం సీహెచ్‌సీకి తరలించి మా తల్లిదండ్రులను కాపాడింది. ఎప్పటికీ వలంటీర్‌కు, ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– బోయిన రమేష్, ప్రశాంత్ నగర్, పాతపట్నం

పవన్ వ్యాఖ్యలపై జనాగ్రహం



ఆమదాలవలస: నిరసన ర్యాలీ చేపడుతున్న వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు

- నిరసన ర్యాలీలు, మానవహారం చేపట్టిన వలంటీర్లు
- మద్దతుతెలిపిన ప్రజలు, ప్రజాప్రతినిధులు

ఆమదాలవలస: నిస్వార్థంగా ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లపై జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని వలంటీర్లు మండిపడ్డారు. ఆమదాలవలస పట్టణంలో ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస మున్సిపాలిటీకి చెందిన వలంటీర్లు నిరసన ర్యాలీ నిర్వహించి, ఒన్–వే జంక్షన్‌లోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం మానవహారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు మద్దతు తెలుపుతూ ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవినాగ్ మాట్లాడుతూ వలంటీర్లపై పవన్ తప్పుడు కూతలు కూయడం బాధాకరమన్నారు. కరోనా విపత్తు సమయంలో వలంటీర్లు అందరికంటే ముందుండి ప్రజాసేవ చేశారని, అలాంటి వారిపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడిన పవన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువుల వివరాలు సేకరించి సంఘ విద్రోహ శక్తులకు వలంటీర్లు సమాచారం ఇస్తున్నారన్న వివాదాస్పద ఆరోపణలు వెనుక్కి తీసుకోవాలన్నారు. తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, పార్టీ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు జె.కె.వెంకటేశ్వరరావు, చింతాడ వెంకటరమణ, పార్టీ నాయకులు బి.నిరంజన్, కూన రామకృష్ణ, కె.సన్యాసిరావు, పి.చిన్నారావు, ఎం.రమేష్‌కుమార్, బి.సత్యం తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు: పవన్ దిష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న గ్రామ వలంటీర్లు



ఆమదాలవలస: మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

కుంటిభద్రలో..

కొత్తూరు: మండలంలోని కుంటిభద్రలో పవన్ దిష్టి బొమ్మను గ్రామ వలంటీర్లు మంగళవారం దగ్ధం చేసి నిరసన తెలిపారు. గ్రామ వలంటీర్లపై పవన్ వ్యాఖ్యలు ఆయన దగజారుడుతనానికి నిదర్శనమన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి



బూర్జ: చీడివలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



సారవకోట: కిన్నెరవాడలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



పాతపట్నం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

అర్హులందరికీ ప్రభుత్వ సేవలు చేరువ చేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యేలు ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి అన్నారు. బూర్జ మండలంలోని చీడివలస, గుత్తావల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. సారవకోట మండలంలోని కిన్నెరవాడ, ధర్మలక్ష్మీపురం సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హాజరయ్యారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. పాతపట్నం మండలంలోని సింగుపురం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరయ్యారు. ఈ సచివాలయం పరిధిలో 1,554 మంది దరఖాస్తు చేసుకోగా.. 1,403 మందికి సర్టిఫికెట్లను అందించారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కొత్తూరు మండలంలోని సిరుసువాడ, బలగ గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి పాల్గొన్నారు. హిరమండలం మండలంలోని కిట్టలపాడు,అంబావల్లి సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరయ్యారు. 200 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 11 రకాల ఉచిత సేవలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందజేశారు.

- సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: ఉర్లాంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ



హిరమండలం: కిట్టలపాడులో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



జలుమూరు: జోనంకిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య



సరుబుజ్జిలి: కొత్తకోటలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కొత్తూరు: బలదలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఆమదాలవలస రూరల్: కలివరంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం



మెళియాపుట్టి: గొప్పిలిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గ్రామాల్లో ఆవేటి వారాల సందడి



హిరమండలం: అమ్మవారి ఆలయానికి ముర్రాటలతో వెళ్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి (ఆవేటి) వారాల సందడి నెలకొంది. మండలంలోని తురకపేట, శ్రీనివాసనగర్‌తో పాటు పలు గ్రామాల్లో అమ్మవారికి ఆవేటి వారాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆవేటి వారాల పేరుతో గ్రామ దేవతలకు ముర్రాటలు పోసి చల్లదనం చేశారు. అనంతరం యాటలు చెల్లించి మొక్కలు తీర్చుకున్నారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, రైతులకు వాతావరణ పరిస్థితులు అనుకూలించాలని అమ్మవారి ఆలయాల వద్దకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని పూజలు చేపట్టారు.



ఎల్.ఎన్.పేట: శ్రీనివాసనగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

హిరమండలంలో..

హిరమండలం: మండల కేంద్రంలోని అంధవరపు, గిరిజాల, కోట్ని, రెల్లివీధి, మోనింగువారి వీధుల్లో ఆవేటి వారాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని చెవిటమ్మతల్లి, అగ్రహారం అమ్మతల్లి, నీలమణి దుర్గ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ముర్రాటలతో అమ్మతల్లులకు చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సకాలంలో పడి పంటలు బాగా పండాలని పూజలు చేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొత్తూరు: మండలంలోని ఆకులతంపర ఇసుక ర్యాంపు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆ గ్రామ సమీపంలో సోమవారం రాత్రి స్థానిక సెబ్ స్టేషన్ ఎస్‌ఐ డి.ప్రభాకరరావు తన సిబ్బందితో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు మంగళవారం తెలిపారు. ట్రాక్టర్ యజమాని పసలి పాపారావుపై కేసు నమోదు చేశామన్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వలంటీర్లను అవమానించడం తగదు



బూర్జ: మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



పోలాకి: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

బూర్జ: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ గ్రామ వాలంటీర్ల పట్ల అవమానకరంగా మాట్లాడటం తగదని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. చీడివలస, గుత్తావల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ తక్షణమే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల చెంతకే సంక్షేమ పథకాలు అందిస్తున్న వారిని కించపరిచేలా మాట్లాడటం భావ్యం కాదన్నారు. పవన్ మాట్లాడిన తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు. ఎంపీపీ కర్నేన దీప, జెడ్పీటీసీ బెజ్జిపురపు రామారావు,ఏపీ టిడ్కో డైరెక్టర్ ఖండాపు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ ఎక్కడున్నారు?

పోలాకి: కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు, పవన్ కల్యాన్ పక్కరాష్ట్రాల్లో, ఫాం హౌస్‌ల్లో తలదాచుకుని.. ఇప్పుడు ఎన్నికల ఏడాదిలో బయటకువచ్చి వలంటీర్ వ్యవస్థపై విమర్శలు చేయడం తగదని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చెల్లాయివలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్లను విమర్శిస్తే జనం తిరగబడాతరన్నారు. క్షేత్రస్థాయిలో వారితో సేవలు పొందుతున్న అవ్వాతాతలు మొదులకుని అన్నివర్గాల ప్రజలు ఈరోజు వలంటీర్లకు మద్దతుగా ఉన్నారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను అమలుచేసేందుకు, సేవాదృక్పథం కలిగిన వారిని గౌరవవేతనంతో వలంటీర్లుగా ఈ ప్రభుత్వం నియమిస్తే వారిపై పిచ్చిప్రేలాపనలు చేసిన పవన్ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎల్లో మీడియా, చంద్రబాబు అండ్ కో వలంటీర్ల సేవలపై విషప్రచారం చేయడం మానుకోవాలన్నారు. వలంటీర్ల సేవలను గుర్తించిన ప్రజలు మళ్లీ సీఎం జగన్‌కే పట్టం కడతారనే విషయం ఇప్పటికే ప్రతిపక్ష నాయకులకు అర్థమైందని, అందుకే ఇలాంటి పనికిమాలిన మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో స్థానికులు తెలియజేసిన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, వైస్ ఎంపీపీలు కోట అప్పారావు, కలగదండు తాతారావు, స్థానిక సర్పంచ్ చింతు జగ్గునాయుడు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

న్యాయసేవలు సక్రమంగా అందాలి

పాతపట్నం: స్థానిక సబ్‌జైల్‌లో ఉన్న ఖైదీలకు న్యాయసేవలు సక్రమంగా అందేలా చూడాలని జిల్లా న్యాయసేవ అధికారుల సంస్థ కార్యదర్శి, సినియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. పాతపట్నం సబ్‌జైల్‌ను మంగళవారం సందర్శించి ఖైదీలతో మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు, న్యాయ సేవల గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత నేరగాళ్ల రికార్డులను పరిశీలించారు. అనతరం పాతపట్నంలోని బీసీ, ట్రైబుల్, ఎస్టీ వసతిగృహాలను సందర్శించారు. న్యాయవాది సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దానయ్య, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌జైల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న సినియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

డిగ్రీ విద్యార్థిని అదృశ్యం

పొందూరు: డిగ్రీ పరీక్షలు రాయడానికి వెళ్లిన విద్యార్థిని ఇంటికి రాలేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పొందూరు ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు మంగళవారం తెలిపారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం అప్పలగ్రహారం గ్రామానికి చెందిన యువతి పొందూరులోని ఓ డిగ్రీ కళాశాలలో పరీక్షలు రాసేందుకు సోమవారం వచ్చిందన్నారు. జి.సిగడాం మండలంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతోందన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.